అభాగ్యులు

శ్రీమతి V. సుశీలాదేవి B. A.

నా పిల్లలందరికి ప్రత్యేకంగా ఒక్కొక్కరికి వొక్కొక్క తోటవుంది. తోటంతా పూలగోలాలతో నిండివుంది. ఒక రోజున ఉదయమే లేచి చూస్తే ప్రతిగోలాంలోను పూలు వికసించివున్నయి.

పాపం! పిల్లలు! ఎవరి పూలమొక్కలు వాళ్లకి అందంగా కనిపించేవి. ముగ్గురూ కలిసి 'మా పూలు బాగున్నాయి' అంటే, మా పూలు బాగున్నాయని పెద్ద చర్చ సాగించి, చివరకు దెబ్బలాటలోకి దిగారు. ముగ్గురికి ముగ్గురే! ఒకరు హిట్లరు అయితే, యింకొకరు ముసోలినీ మరియొకరు స్టాలిన్. ఒకరి నొకరు తీసిపోరు. ఈ త్రిమూర్తులకు తల్లినయ్యే భాగ్యము నాకు ఒకేసారి లభించింది.

ఆ యుద్ధంలో ముగ్గురు తీవ్రంగా తిట్టుకొంటున్నారు. అది విని నేను తోటలోకి వచ్చాను. నన్ను చూడంగానే, అందరూ ఒకసారి వారి వారి పక్షము సమర్థించుకుంటూ న్యాయం చెప్పుచున్నారు. న్యాయం చెప్పడమనేది కోర్టులో జడ్జీ చెప్పేటంత సులువుకాదిది. జడ్జీకైతే "లా" అని "రూల్సు" అని యేవేవో వుంటాయి. మరి నాకు అవేమీ లేవు. ఎవరిపైపు చెప్పిన వాళ్ళకు కోపం వస్తుంది. వీళ్ళకు తీర్పు యెలా చెప్పడమా అని ఆలోచిస్తున్నాను.

ఇంతలో వారి నాన్నగారొచ్చారు. వారికి అరుపులు గిరుపులు యిష్టంలేదు. ఎవరైన కాస్త పంచమ స్వరంలో మాట్లాడడం అనేది అసలే యిష్టం లేదు. పిల్లల దెబ్బలాట చూడంగానే "ఎవర్రా? అది! ఎందుకు దెబ్బలాడుతున్నారు? మీ రిలా దెబ్బలాడారంటే నేను మీ అమ్మను సత్యాగ్రహము చేయించను తెలుసా!" అని గట్టిగా కేకలేశారు.

ఇది వినగానే హిట్లర్, ముసోలినీలు శాంతించారు. ఏ తల్లిసహాయం లేకుండ రోజూ ఒక్కపని కూడ చేయలేరో, ఏ తల్లి లేకుండా రోజూ స్కూలుకు వెళ్ళలేరో, ఆ నా పిల్లలే నన్ను సత్యాగ్రహం చేయడం, జైలుకు వెళ్ళడం హృదయపూర్వకంగా కోరుతున్నారు.

అప్పుడు నేను వారితో "యిప్పుడేమి ఫిర్యాదు లేదుకదా!" అని అడిగితే, అందరూ ఒకే కంఠముతో "లేదమ్మా, అందరి పూలు బాగానే వున్నాయి. నీవు సత్యాగ్రహంచేయమ్మా, జైలుకు వెళ్ళమ్మా" అన్నారు.

మేమంతా యింట్లోకి వెడదామనుకొంటుంటే యింటిలో బయటనుండి పిల్లల దీనాలాపన వినబడింది. అందరూ బయటికివచ్చి చూశాం. ముగ్గురు పిల్లలు. అందులో ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు. పెద్దమ్మాయి పదేండ్లది, చిన్నదానికి ఎనిమిది ఏళ్లు, పిల్లాడికి అయిదేళ్లు వుంటాయి మమ్ములను చూడంగానే వాళ్ళు పాటాపి మాకు దండంపెట్టి, ఆకలితో మండిపోతున్న వాళ్ళ కడుపును చూపించారు. పెద్దదాని చేతులో ఒక సంచి, చిన్నదాని చేతులో ఒక టిన్ను డబ్బా! రెండు ఖాళీవే! వాళ్ళు మమ్ములని యాచన దృష్టితో చూస్తున్నారు. నేనప్పుడు

"మీరు చాల బాగా పాడుతున్నారుగాని, యింకేమైన పాటలువచ్చా!" అని అడిగాను.

పెద్దది జవాబుచెప్పేలోపల చిన్నది "మాకు భజనకూడ వచ్చునమ్మగారు!" అంది. ఇంక మేము అడగకుండానే పాడడం మొదలు పెట్టారు. వచ్చి రాని మాటలతో ముద్దు ముద్దుగా ఆ పిల్లాడుకూడ పాడుతుంటే మాకు నవ్వొచ్చింది. మేము నవ్వడం జూసి పాపం! వాళ్ళు సిగ్గుపడి పాడడం మానే శారు. వారిని చూస్తుంటే యేదో తెలియని బాధ పడుతున్నట్టు కనిపించింది. అప్పుడు నేను "చాల బాగా పాడారుగాని, మీకేం కావాలి? అన్నం పెట్టమంటారా లేకపోతే బియ్యము వెయ్య మంటారా?" అని అడిగాను. పెద్దపిల్ల మళ్ళీ సలాంచేస్తూ "యేదో ఒకటి యివ్వండమ్మగారు, నిన్నటినుండి యేమీతినలేదు" అన్నది హీనస్వరంలో. పిల్లలతో వాళ్ళకు రెండు పూరీలివ్వమనిచెప్పి యింట్లోకి వెళ్ళాను.

పిల్లలు వాళ్ళకెన్ని పూరీలు యిచ్చారో తెలి యదుగాని, ఇంట్లోకివెళ్ళి చూసేసరికి డబ్బాలో ఒక్క పూరీలేదు సరిగదా, దానితోపాటు గిన్నె లోని కూరకూడలేదు.

మరుసటిరోజు ప్రొద్దున్నే మేము టీ త్రాగుతుంటే మళ్ళీ ఆ బాల గాయకుల కోమల స్వరం వినిపించింది. అప్పుడు నేను పిల్లలతో "చూశారా! నిన్న మీరు బాగా పూరీలను రుచి మాపించారు. ఇప్పుడు చూడండి! మళ్ళీ వచ్చారువాళ్ళు! వాళ్ళకోసం యిక్కడ పూరీలుచేసి పెట్టినట్టు" అని అన్నాను. అందరూ ఒక్కసారి "చేసిపెట్టాపుకదమ్మా" అని మళ్ళీ పూరీల డబ్బా దగ్గరకు పరుగెత్తారు. "ఇక ఆగండి. రోజూ యిదే పనేమిటి? ఇలాగ పూరీలు మరగనిస్తే వాళ్ళింక గుమ్మం వదలరు. కొంచెము బియ్యంపడేసి పంపండి" అన్నాను గట్టిగా.

ఇంతలో మా మొదటివాడు "పాపం! చిన్న చిన్న పిల్లలమ్మా! వాళ్ళ అమ్మందో లేదో! వాళ్ళు యెలాగ వండుకొంటారమ్మా" అన్నాడు జాలి వొలకపోస్తూ, ఇంక రెండవవాడు "దీనికంటె వాళ్ళకేమి యివ్వకుండా వుండడమే మంచిదన్నాడు" వ్యంగ్యంగా, అంతలో అందరికంటె చిన్నవాడు "నీవుకూడ తల్లివై వుండి యిలా మాట్లాడతావేమమ్మా! పాపం! వాళ్ళ కాకలివేస్తుందేమో! పోనీ, మా భాగంలోనిదైన వాళ్ళ కివ్వమ్మా" అన్నాడు ముద్దు ముద్దుగా. నేనేమి అడ్డుచెప్పలేకపోయాను. "మళ్ళీ మీకు రాత్రికి వండాల్సి వస్తుందన్నాను" ఉదా సీనంగా. "అమ్మా! మేము భోంచెయ్యములేమ్మా" అని అందరూ ఏకకంఠముతోపల్కి పూరీలు తీసికొని గుమ్మం దగ్గరకు పరుగెత్తారు.

తరువాత నేను ఇంట్లో పని ముగించుకొని యివ తలకువచ్చి చూసేసరికి వాళ్ళెంతో ఆప్యాయంగా వాటిని తింటున్నారు. ఆ దృశ్యం చూసేసరికి నాకు జాలేసింది. వాళ్ళు వెళ్ళిపోతుంటే ఆపి "మీ ముగ్గురు అక్కా చెల్లెళ్ళా" అని అడిగాను. "ఔన మ్మగారు" అన్నది పెద్దది.

"మీ పేర్లేమిటి?"

"వెంకి, సీత, రాముడు."

"మీ అమ్మ నాన్న వున్నారా?"

అందరికంటె చిన్నది "అమ్ముంది, నాన్న వున్నాడు. అందరూ వున్నారు" అన్నది ఆతు రతతో. అయితే "మీ అమ్మ నాన్న యెక్క డున్నారు" అన్నాను.

"మా నాన్న అమరావతిలో, మా అమ్మ" ... అని చెప్తుంటే, ఇంతలో మా చిన్నవాడు "అమరా వతిలో మీ నాన్న యేంచేస్తున్నాడు" అని అడి గాడు ఆదుర్దాగా. "జైలులో వున్నాడు చిన్న బాబుగారు" అని జవాబిచ్చింది.

నా కాశ్చర్యమేసి "జైలుకెందు కెళ్ళాడు?" అని అడిగాను.

"మా నాన్నయేమో! కల్లుతాగుతుండేవాడమ్మ గారు, తాగిన వాడు వూరికుండేవాడుకాదు. మా అమ్మను నానా మాటలు తిట్టి చావకొట్టేవాడమ్మ

గారు! ఒక రోజున పోలీసులు తన్ని పట్టుకొని జైలులో పెట్టారండి” అని దీనంగా చెప్పసాగింది.

“అయితే మీ అమ్మ యెక్కడున్నది” అని అడుగగా, “మా అమ్మకూడ జైలులో వుందండి. దానితో మా తమ్ముడుకూడ వున్నాడండి. వాడు అందరికంటె బాగుంటాడు అమ్మగారు” అని చెప్పవుపోయింది. పాపం! పసికందులు తల్లిదండ్రులు చేసిన దుర్మార్గమువల్ల, అనాథులై వీధివెంబడి అడుక్కోవలసి వచ్చింది. ఇలాగ యెంతమంది అభాగ్యులు బాధపడుతున్నారో కదా! అని మనస్సంతా కలవరపడింది.

అయితే “మీ అమ్మ జైలుకెందుకు వెళ్ళింది?” అని అడిగాను,

“మా అమ్మ, మా నాన్నను పట్టుకొన్న పోలీసును చంపిందండి. అందుకని మా అమ్మనుకూడ జైల్లో పెట్టారండి! ఈ రాముడేమో రోజూ “అమ్మా, అమ్మా” అని ఒకటే ఏడ్పండి” అని జవాబిచ్చింది.

వాడి వాలకం చూస్తే దరిద్రదేవతంతా వాడిమీద తాండవిస్తుందన్నట్టుంది. చింపిరి గుడ్డలు చుట్టుకొని వున్నాడు. జుట్టుచూస్తే, నూనె అన్నమాట లేక పెద్ద ముళ్ళపొదలాగ చుట్టుకొనివుంది. ముట్టుకొంటె మన్ను అంటుకుకవస్తుందేమో అన్నట్లున్నది వాడి శరీరము. ఏడ్చిఏడ్చి కన్నీటిధారలు వాడి బుగ్గలపైన శాశ్వతంగా నిలచిపోయింది. వాళ్ళ ఆకారాలను చూస్తూంటే నాకెంతో బాధకల్గింది. “మీ అమ్మను చూడ్డానికి వెళ్ళరా? మీరు రాత్రిళ్ళు యెక్కడ పడుకొంటారు? మీకు చీకట్లో భయంలేదా?” అని అడిగాను పెద్ద పిల్లతో.

“వెళ్తావమ్మగారు మూడు నెలల కొకసారి. జైలు దగ్గర ఒక కాలువవుంది. మేము రాత్రిళ్ళు వంతెన దగ్గర పడుకొని మా అమ్మతో మాట్లాడుకొంటూ నిద్రపోతామమ్మగారు!”

“మీ అమ్మకి యెన్ని రోజులు శిక్ష విధించారు!”

“రెండు సంll లు. మా అమ్మని జైలునుండి విడచిపెట్టగానే మేమంతా దేశం వెళ్ళిపోతామండి” అని చెప్పి, అప్పుడే వాళ్ళదేశం వెడుతున్నట్లు ఊహించి ఒక్కసారి సంతోషం పట్టలేక సతమతమైంది. నేను వాళ్ళదుస్థితిచూసి, వాళ్లకేదైన పాత బట్ట పడేయమని సౌంజ్ఞచేయగానే మా పిల్లలు వాళ్లకిష్టమొచ్చినట్టు బట్టలిచ్చిపంపారు.

ఈ సంఘటన జరిగిన రెండు రోజులకే నేను కూడ సత్యాగ్రహము చేసి జైలుకు అతిథిగా వెళ్లాను. మా పిల్లలందరు నన్ను యెంతో సంతోషముతో వీడ్కోలిచ్చారు.

జైలులో వివిధరకములైన మనుష్యులు. అదొక వింత ప్రపంచం! అందులో ఒక స్త్రీ తన పుట్టిన పిల్లను చంపిన హంతకురాలు! మరియొకతె భర్తకు అత్తగారికి విషంపెట్టిన మహా ఇల్లాలు! వాళ్లను చూస్తూంటే నిజంగా వీరు స్త్రీలేనా? లేక రాక్షసులా! అనిపించింది.

నాకేదైన అందివ్వడానికి ఇద్దరు స్త్రీలను నియమించారు. అందులోఒకతె తెలివికలదైనప్పటికి కొంచెము వయస్సులో చిన్నది. మరియొకతె ప్రౌఢ! ఆమె వొళ్ళో ఒక కుర్రాడున్నాడు. ఆమెయెప్పుడూ అంతగా మాట్లాడేది కాదు. ఎప్పుడూ యేదో ఆలోచిస్తూ పని చేస్తూండేది. పాపం! చంటిపిల్లవాని వీపుమీద వేసికొనే అన్నిపనులు చేస్తూండేది. ఆమెను జూస్తేనాకు జాలివేసింది. ఆమె పేరు లక్ష్మి.

నేను యెప్పుడూ యీ లక్ష్మి యెవరు అని ఆలోచిస్తూండేదాన్ని. ఒక రోజున మేట్రన్‌ని “ఈమెవరని” అడిగాను. అప్పుడామె “అమ్మో! ఆమనిషా? చాల ప్రమాదకరమైన మనిషి! పోలీసును చంపింది. ఏం? మీకేమైన యిబ్బంది పెడుతుందా?” అని అడిగింది.

ఈ మాటలువినగానే ఆ బాలగాయకులు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళ అమ్మకూడ జైలుకువెళ్లింది. నేను యెన్నోసార్లు అనుమానము తీర్చుకొందామను

కోన్నా, ఆమె గంభీరమైన, ఉదాసీనమైనమొహం చూసి అడగడానికి సాహించలేకపోయేదాన్ని.

ఒక రోజు రాత్రి పెద్ద ఉరుములు, మెరుపులతో వర్షంపడుతోంది. నాకు వెంటనే నా పిల్లలు జ్ఞాపకం వచ్చారు. చిన్నవాడికి ఉరుములంటె చెడ్డభయం! నన్ను గట్టిగా కాగలించుకొని పడుకొనేవాడు. పాపం! ఆ వంతెనదగ్గరపడుకొన్నపిల్లలను తలంచుకొనేసరికి వొళ్ళంతా వొక్కసారి వణికిపోయింది. "హే పరమేశ్వరా! అందరి తల్లుల పిల్లలను రక్షించి. తరువాత నా పిల్లలనుకూడ రక్షించుతండ్రీ!" అని ప్రార్థించాను.

రోజూ నాదగ్గరికి పత్రికవస్తూండేది. జైలులోవున్న స్త్రీ ఖైదీలందరు యుద్ధపు వార్తలు వినాలని యెంతో వుత్సాహపడేవారు. నేనుకూడ పేపరు చదివి యేవో వార్తలు చెప్తూండేదాన్ని.

ఆరోజు సాయంకాలముకూడ పేపరువచ్చింది. పేపరు చదువుతుండగా, అకస్మాత్తుగా గుండె ఆగిపోయినంతపని అయింది! అది జబ్బల్‌పూర్ వార్త!

"నిన్నరాత్రి భారీవర్షము పడడంవల్ల జైలు దగ్గరగా నున్న కాలువలో ముగ్గురు బీదపిల్లలు కొట్టుకొనిపోయారు. వారి శవాలు దొరికాయి వారిలో ఇద్దరు ఆడపిల్లలు, ఒకమగపిల్లవాడు. పాటలు పాడుకుంటూ ఆడుకొనే వాళ్ళని తెలిసింది"!

ఈ వార్త చదవగానే, ఆ ముగ్గురి పిల్లల చిత్రాలు కంటికి కట్టినట్లైంది. అశ్రుధారలు ప్రవహించసాగాయి, నోటిమాటకూడ రావడంలేదు. "పాపం! పిల్లలు" అన్నమాటలు మాత్రము వచ్చాయి.

లక్ష్మి నాదగ్గర కూర్చుని టీ తయారు చేస్తోంది. "ఏం? అమ్మా! అలా ఉదాసీనంగా వున్నారు? పిల్లలు జ్ఞాపకంవస్తున్నారా!" అని అడిగింది. కానిజవాబివ్వలేకపోయాను. ఆమె మళ్ళీ "పోనీలెండమ్మా! ఇంక కొద్దిరోజులేవున్నాయి. పిల్లలు తండ్రిదగ్గిరే వున్నారు కదా! ఇక భయమెందుకమ్మా" అంది. ఆ మాటలువింటూంటే, ఆమెవైపుచూడడానికైన ధైర్యంలేకపోయింది. తరువాత మెల్లిగా ధైర్యం చేసికొని "లక్ష్మి! నీకింకా పిల్లలేమైనవున్నారా?" అని అడిగాను.

ఆమె నీరసమైన నవ్వు నవ్వి "ఒక్కడే కాదమ్మా, ఇంకావున్నారు ముగ్గురు జైలు అవతల! వాళ్లు భగవంతుని పిల్లలమ్మా! నా పిల్లలని యెలా చెప్పమంటావమ్మా!" అంది కొంచెం గద్గదస్వరంలో.

తరువాత ఆమె యింకా వార్తలు అడుగుతునే వుంది. కాని యింక నేనేమి చెప్పలేకపోయాను.

"భగవంతుని లీల యెంత చిత్రమైనది! ఇలాగ యెంతమందిపిల్లలు తల్లిదండ్రులు చేసినపాపకర్మలకు గురయై అనాధలై అభాగ్యులై తిరుగుతూ, చివరకు ప్రకృతి వొడిలో శాశ్వతంగా నిద్రపోతున్నారో కదా!" అని అనుకుంటూ అలాగే కుర్చీలో కళ్లు మూశాను. ఆనాటి సంఘటన మరువలేని మరుపురాని దృశ్యంలాగ నిల్చిపోయింది.

కడుపునొప్పి, నోట నీరూరుట, త్రేపులు, వాంతులు, మలబద్ధకము లాంటి అజీర్ణ లక్షణములకు
కేసరిగారి
ఆదిత్య లవణము
దివ్య ఔషధము
వెల రు. 1-75 న.పై.
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 14.